# PRESS INFORAMTION BUREAU
# GOVERNMENT OF INDIA
# VIJAYAWADA

| | | | |
|---|---|---|---|
| Subject | Unorganised sector workers in E-Sharm | | |
| Name of the Publication | Eenadu | Page Number | 11 |
| Date | 27-August-2021 | | |
| Language of Publication | Telugu | | |
| Place of Publication | Andhra Pradesh | | |

# 'ఈ-శ్రమ్'లో అసంఘటితం

- కార్మికుల డేటాబేస్‌కు వెబ్‌సైట్ ప్రారంభం
- ఏపీ నుంచి డిసెంబరు కల్లా 1.50 కోట్ల మంది నమోదు లక్ష్యం

**ఈనాడు డిజిటల్, అమరావతి:** కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న అసంఘటిత రంగ కార్మికులకు ప్రత్యేక డేటాబేస్ ఏర్పాటు చేసేందుకు 'ఈ-శ్రమ్' వెబ్ పోర్టల్‌ను గురువారం ప్రారంభించింది. డిసెంబరు 31 నాటికి దేశవ్యాప్తంగా 38 కోట్ల మంది కార్మికులను ఇందులో నమోదు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఏపీకి కోటిన్నర మంది నమోదును లక్ష్యంగా నిర్దేశించింది. ఈ ప్రక్రియ పూర్తి ఉచితంగా జరుగుతుంది.

### అసంఘటిత రంగ కార్మికులు ఎవరంటే...

- వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో ఉపాధి పొందే.. చిన్న సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు, ఉద్యానాలు, నర్సరీలు, పాడిపరిశ్రమలపై ఆధారపడి బతికేవారు. ఉమ్మడి వ్యవసాయ దారులు, మత్స్యకారులు.
- భవన, ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేసే.. తాపీ, తవ్వకం, రాళ్లుకొట్టే పని, సెంట్రింగ్, రాడ్ బెండింగ్, ప్లంబింగ్, కార్పెంటర్, శానిటరీ, పెయింటింగ్, టైల్స్ పని, ఎలక్ట్రీషియన్, వెల్డింగ్, ఇటుక, సున్నం బట్టీల పని, రిగ్గర్లు, కాంక్రీటు మిక్సర్, బావుల తవ్వకం, పూడికతీత వంటి పనులు చేసేవారు.
- టైలరింగ్, ఎంబ్రాయిడరీ, డ్రెస్ మేకర్స్, ఆటోమొబైల్, రవాణా రంగాల్లో పనిచేసే డ్రైవర్లు, హెల్పర్లు, చేనేత, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరి, క్షౌరవృత్తి, బ్యూటీ పార్లర్లలో పనిచేసేవారు, చర్మకారులు, రజకులు.
- స్వయం ఉపాధి పొందే... వీధి, తోపుడు బళ్ల వ్యాపారులు, ఇంటి వద్ద వస్తువులు తయారు చేసే వారు, చిరు వ్యాపారులు, కల్లుగీత కార్మికులు, కళాకారులు, రిక్షా కార్మికులు, బీడీ కార్మికులు, చెత్త ఏరే వారు.
- సేవారంగంలోని... ఇళ్లలో పాచి పనులు చేసేవారు, కొరియర్ బాయ్స్, ఇంటి వద్ద రోగులకు సేవలందించేవారు, కమిషన్ మీద వస్తువులు సరఫరా చేసే వారు.
- ఉపాధి కూలీలు, ఆశాలు, స్వయం సహాయక సంఘాలు, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన వర్కర్లు, విద్యావాలంటీర్లు, గ్రామ, వార్డు వాలంటీర్లు.
- హమాలీలు, దుకాణాలు, ఇతర సంస్థల్లో పనిచేసే వారు. ఆహార పరిశ్రమ, బేకరీ, పాల ఉత్పత్తులు, ఫాస్ట్‌ఫుడ్ తయారీ దారులు, వలస కార్మికులు.

### ఎవరెవరు అర్హులంటే...

తప్పనిసరిగా అసంఘటిత రంగ కార్మికులై, 16 నుంచి 59 సంవత్సరాలలోపు వయసున్న వారు ఇందులో చేరొచ్చు. ఆదాయ పన్ను చెల్లించని వారు, ఈపీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాల పరిధిలోనికి రాని వారు మాత్రమే దీనికి అర్హులు.

### ఇవీ ప్రయోజనాలు

- ఈ-శ్రమ్‌లో చేరిన ప్రతి కార్మికుడికి 12 అంకెల ప్రత్యేక గుర్తింపు నంబరు (యూనివర్సల్ అకౌంట్ నంబర్-యూఏఎన్) ఇస్తారు. ఈ కార్డుంటేనే ప్రభుత్వ సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు వర్తిస్తాయి.
- ఇప్పటి వరకు కొన్ని పథకాలు కుటుంబంలో ఒక్కరికే వర్తిస్తున్నాయి. దీనివల్ల ఆ కుటుంబంలో అదనంగా ఒకరిద్దరు అసంఘటిత రంగ కార్మికులుంటే నష్టపోతున్నారు. ఇప్పుడా సమస్య ఉండదు. ఈ-శ్రమ్ కార్డున్న అందరికీ ప్రయోజనాలు దక్కుతాయి.
- ఇందులో నమోదైన ప్రతి కార్మికుడికి ఒక ఏడాది పాటు ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన కింద రూ.రెండు లక్షల ప్రమాద మరణ/అంగవైకల్య బీమా ఉచితంగా వర్తిస్తుంది.

### ఎక్కడ ఎలా నమోదు చేసుకోవాలి?

సమీప గ్రామ, వార్డు సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీ), ఎంపిక చేసిన కొన్ని పోస్టాఫీసులు, కార్మిక కార్యాలయాల్లో నమోదు చేసుకోవచ్చు. నమోదు



చేసుకున్న వెంటనే యూఏఎన్‌తో కూడిన ఈ-శ్రమ్ కార్డు జారీ చేస్తారు. ఈ-కేవైసీ కలిగిన ఆధార్ కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన ఫోన్ నంబరు, బ్యాంకు ఖాతా, దాని ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లతో నమోదు కేంద్రాలకు వెళ్లాలి. ఆధార్ నంబరు ఎంటర్ చేయగానే ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. దాని ద్వారా నమోదవ్వొచ్చు. ఫోన్ నంబరు లేని వారు బయోమెట్రిక్ వేలిముద్ర/ఐరిస్ స్కానింగ్ ద్వారా నమోదు చేయించుకోవచ్చు.

"అసంఘటిత కార్మికుల డేటాబేస్ లేకపోవడంతోనే ఇటీవల కేంద్ర ప్రభుత్వం కరోనా సమయంలో వారికి సాయం చేయలేక పోయింది. ఈ-శ్రమ్‌తో భవిష్యత్తులో అలాంటి సమస్యలు ఉండవు. వారి భవిష్యత్తంతా ఈ కార్డుపైనే ఆధారపడి ఉంటుంది" అని కార్మిక శాఖ అధికారులు చెబుతున్నారు.

Union government launched special "E-Shram" portal for database of unorganised sector workers in country

Aim is to complete registration of 38 crore unorganised sector workers by 31st December in country

Registered workers will get two lakh accidental insurance under Pradhan Mantri Suraksha Bhima Yojana for one year

Registered workers get 12 digits registration ID with this they would also eligible to government social security and welfare schemes

Workers should register their details at nearest village, ward secretariat, common services centres, identified post offices and labour offices with aadhar card seeded e-kyc, bank account details, phone number and required details

Andhra Pradesh aim will to register 1.50 crore workers by 31st December